TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 89 | 18 ఆదివారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

టీడీపీలో చేరిన ముడివేముల గ్రామ వైసీపీ అధ్యక్షుడు

త్రిపురాంతకం అక్టోబర్ 17 వార్త బిపీక న్యూస్:

స్థానిక సంస్థల ఎన్నికల వేళ ముడివేముల గ్రామంలో వైఎస్సార్‌సీపీకి ఎదురుదెబ్బ తగిలింది. గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దూదిపల్లి సుబ్బయ్య తెలుగుదేశం పార్టీలో చేరారు.యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో సుబ్బయ్య టీడీపీలో చేరగా, ఎరిక్షన్ బాబు ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేకల వలరాజు యాదవ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు

షరతులతో బెయిల్...

- నిరసన యాత్రకు ముందు దీప్కేను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- నేడు బెయిల్ ఇచ్చిన మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు
- రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశం
- ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని షరతు
- కన్నాట్ ప్లేస్‌లో నిరసన యాత్రకు అనుమతి నిరాకరించిన పోలీసులు



కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు న్యూఢిల్లీలోని మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ఆయన విడుదలకు మార్గం సుగమం చేసింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 ప్రకారం, ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదన్న షరతుకు ఆయన కట్టుబడి ఉండాల్సి ఉంటుంది.ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన యాత్రకు ముందు, శుక్రవారం ఢిల్లీ పోలీసులు ఆయనను ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ...మిగతా 2 లో...

అనిరుధ్-కావ్య పెళ్లి రిసెప్షన్..

మోదీ, విజయ్‌లను ఆహ్వానించిన మారన్ దంపతులు

- అనిరుధ్, కావ్య రిసెప్షన్ కు మోదీకి ఆహ్వానం
- తమిళనాడు సీఎం విజయ్‌కు సైతం ఆహ్వాన పత్రిక
- చెన్నైలో నవంబరు 21న రిసెప్షన్
- నవంబరు 11న గ్రీస్‌లో పెళ్లంటూ ప్రచారం
- వివాహ వివరాలను అధికారికంగా ప్రకటించని జంట





ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

2 లో



జగన్ ఒక 'అరుదైన పీస్'.. కేసులు తేలేవరకు రాజకీయాలకు దూరం ఉండాలి: సోమిరెడ్డి

- ఏ నాయకుడిపై లేనన్ని కేసులు జగన్ పై ఉన్నాయన్న సోమిరెడ్డి
- తిరుమల ప్రసాదం కోసం కల్తీ నెయ్యి వాడారని మండిపాటు
- అద్వానీని జగన్ ఆదర్శంగా తీసుకోవాలని హితవు

2 లో

కావ్య-అనిరుధ్ వివాహ రిసెప్షన్...

చంద్రబాబు, లోకేశ్ లను ఆహ్వానించిన మారన్ దంపతులు

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ భేటీ
- కుమార్తె కావ్య-అనిరుధ్ వివాహ రిసెప్షన్‌కు రావాల్సిందిగా ఆహ్వానం
- మంత్రి నారా లోకేశ్ ను కూడా కలిసి ఆహ్వాన పత్రిక అందజేత
- నవంబరు 21న చెన్నైలో రిసెప్షన్
- వివాహం నవంబరు 11న గ్రీస్ లో జరుగుతుందంటూ ప్రచారం



ప్రముఖ పారిశ్రామికవేత్త, సన్ టీవీ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ తన అర్ధాంగి కావేరి కళానిధితో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తమ కుమార్తె కావ్య మారన్, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ల వివాహ రిసెప్షన్‌కు హాజరు కావాల్సిందిగా వారు ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చెన్నైలో నవంబరు 21న జరగనున్న వివాహ రిసెప్షన్ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను కళానిధి మారన్ దంపతులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వయంగా అందజేశారు. ఈ భేటీ ఆద్యంతం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.అనంతరం, కళానిధి మారన్ దంపతులు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ను కూడా కలిశారు. ఆయనకు కూడా తమ కుమార్తె వివాహ రిసెప్షన్ ఆహ్వాన పత్రికను అందించి, వేడుకకు రావాల్సిందిగా కోరారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల మధ్య ఈ ఆత్మీయ కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది.కాగా, అనిరుధ్-కావ్యాల వివాహం నవంబరు 11న గ్రీస్ లో జరుగుతుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం...

గెట్ రెడీ..!

- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన
- రెండు పార్టీలకు గుణపాఠం చెప్పే మూడో ప్రత్యామ్నాయం రావాలన్న విజయసాయి
- నవంబర్ రెండో వారంలో కలుద్దామని, జెన్-జీ సిద్ధంగా ఉండాలని పిలుపు



ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్-జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. "ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!" అంటూ తన పోస్టును ముగించారు.

తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన..

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ



హైదరాబాద్‌లోనూ ఈడీ మెరుపుదాడులు...

ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

- హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ దాడులు
- అక్టోబర్ 13న 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు
- దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు గుర్తింపు
- షెల్ కంపెనీలు, క్రిప్టో కరెన్సీ ద్వారా నిధులను విదేశాలకు తరలిస్తున్నట్లు వెల్లడి
- కేసుతో సంబంధం ఉన్న పలు బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన ఈడీ



TGTEL/26/A5513
వార్త దీపిక

హైదరాబాద్‌లోనూ ఈడీ మెరుపుదాడులు... ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

మొదటిపేజీ తరువాయి

మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రీమీూ) కింద, ఈ కేసుతో సంబంధం ఉన్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు పేర్కొంది.“ఆల్ ప్యానెల్ ఎక్స్ఛేంజ్”, “వీ+వీ91” అనే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో భాగంగా గతంలో పుణె, ముంబై, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన అధికారులు, ఎడ్సమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రాంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పుణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. రాంధాని సంస్థ “ఐపైసా” (ఖుఖఐఖ) అనే ప్రత్యేక పేమెంట్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించి, దాని ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆపరేటర్ల కోసం 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లావాదేవీలు నడిపినట్లు ఈడీ గుర్తించింది.ఈ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలకు, నిధుల మళ్లింపునకు కొన్ని సహకార బ్యాంకులు కూడా సహకరించినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బును మూడు మార్గాల్లో దేశం దాటించినట్లు గుర్తించారు. వాణిజ్య లావాదేవీల ముసుగులో ఓవర్ ఇన్వాయిసింగ్ ద్వారా, ఏపీఎంసీ యూనిట్ల పేరుతో తెరిచిన మ్యూల్ ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేయడం ద్వారా, చివరిగా క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది.

ఏపీని ‘సౌత్ బీహార్’గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

మొదటిపేజీ తరువాయి

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో ‘సౌత్ బీహార్’గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. “కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?” అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు.నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.



తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ

అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

ఎల్ నినో ప్రభావం దృష్ట్యా వరి సాగు వద్దని రైతులకు హితవు

దళారులు, ప్రైవేట్ వ్యాపారులను నమ్మి మోసపోవద్దు

నీటి వనరులు వృధా కాకుండా గట్టి నిఘా కొనసాగించాలి : కలెక్టర్

నిజామాబాద్,అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ నిరంతర పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంట సాగు చేయవద్దని రైతులకు హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యూ.ఎస్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో తాగునీటి సరఫరా, పంటల సాగు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత ఖరీఫ్ పంటలను ఏదోవిధంగా కాపాడుకోగలిగినా, రబీలో పంటలకు సాగునీరు అందించడం కష్టతరంగా మారుతుందని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు అందుబాటులో ఉన్నందున తగినంత విద్యుత్ ఉత్పత్తి జరుగక, పంటలకు కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వచ్చే పది నెలల వరకు నిజామాబాద్ నగరం సహా అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామాలలో ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచి నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, ప్రైవేట్ వ్యాపారులను, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జాగ్రత్తలు సూచించారు. ఖరీఫ్ లో ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి పంటకు ప్రస్తుతం మార్కెట్ మంచి గిట్టుబాటు ధర పలుకుతోందని, దిగుబడులు కూడా ఆశించిన మేరకు చేతికి అందుతున్నాయని అన్నారు. అయితే రైతులు తమ పంటను నగదు పద్ధతిన విక్రయించాలని అన్నారు. గతంలో రైతుల నుంచి పంట సేకరించి నగదు చెల్లించకుండా పలువురు వ్యాపారులు మోసగించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ తరహా ఘటనలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, నగదు చెల్లింపులు వెంటదివెంట జరిపే వారికే ధాన్యం విక్రయించాలని హితవు పలికారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎక్కడ కూడా నీటి వృధా జరుగకుండా గట్టి నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చోట మరమ్మతులు, తాగునీటి సరఫరా పనులు వేగంగా చేపట్టేలా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అవసరమైన చోట తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప కొత్త బోర్లను తవ్వించకూడదని అన్నారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు

షరతులతో బెయిల్...

మొదటిపేజీ తరువాయి

ఈ నిరసన యాత్రకు ముందు సుమారు 20 మందికి పైగా పోలీసులు దీప్కే నివాసానికి వెళ్లి ఆయనకు రెండు నోటీసులు అందజేశారు. కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం వల్ల తొక్కిసలాట జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున అక్కడ నిరసనలు చేపట్టరాదని ఒక నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమర్పించిన బాండ్ షరతులను ఉల్లంఘిస్తున్నారని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన రెండో నోటీసులో పోలీసులు హెచ్చరించారు.అక్టోబర్ 10న కూడా దీప్కే, ఆయన సహచరులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతియుతంగా ఉంటామని హామీ ఇస్తూ, ఒక్కొక్కరు రూ. 50,000 పూచీకత్తు సమర్పించి వారు విడుదలయ్యారు. సీజేపీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో ‘లెహ్రా దో తిరంగా’ యాత్రను నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున, ఢిల్లీ పోలీసులు ఈ యాత్రకు అనుమతి నిరాకరించారు.

అనిరుధ్-కావ్య పెళ్లి రిసెప్షన్..

మోదీ, విజయ్‌లను ఆహ్వానించిన మారన్ దంపతులు

మొదటిపేజీ తరువాయి

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్ టీవీ గ్రూప్ అధినేత కళానిధి మారన్ కుమార్తె కావ్య మారన్ వివాహ వేడుకపై ఆసక్తి పెరుగుతోంది. ఈ జంట వివాహ రిసెప్షన్‌కు రావాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌లకు ఆహ్వానం అందింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.కావ్య, అనిరుధ్ వివాహ రిసెప్షన్‌కు రావాలని కోరుతూ కళానిధి మారన్ ప్రధాని మోదీకి ఆహ్వాన పత్రిక అందించారు. కాగా, ఈ కార్యక్రమంలో అనిరుధ్ తల్లిదండ్రులు కూడా పాల్గొన్నట్లు సన్ న్యూస్ వెల్లడించింది. అయితే ఈ భేటీకి సంబంధించిన ఫొటోల్లో అనిరుధ్ కనిపించలేదు. సీఎం విజయ్‌ను కలిసిన జంట తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను కూడా కళానిధి మారన్ కలిశారు. కావ్య, అనిరుధ్ రిసెప్షన్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలను సన్ న్యూస్ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఇందులో అనిరుధ్ కూడా ఉండడంతో ఈ చిత్రాలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. నవంబరు 21న రిసెప్షన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్టోబరు 16న ఈ వివాహ రిసెప్షన్ వివరాలను వెల్లడించారు. చెన్నైలో నవంబరు 21న వేడుక జరగనున్నట్లు తెలిపారు. కావ్య తల్లిదండ్రులు కళానిధి మారన్, కావేరి మారన్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. గ్రీస్‌లో పెళ్లి? అనిరుధ్, కావ్య నవంబరు 11న గ్రీస్‌లో వివాహం చేసుకోనున్నట్లు కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ పెళ్లి తేదీ, వేడుకల వివరాలను అనిరుధ్, కావ్య అధికారికంగా ప్రకటించలేదు.అనిరుధ్ ప్రముఖ సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందారు. ‘లియో’, ‘ఇండియన్ 2’, ‘కూలీ’, జైలర్ వంటి హిట్ చిత్రాలకు సంగీతం అందించాడు. కావ్య మారన్ సన్ టీవీ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తోంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతోనూ ఆమెకు అనుబంధం ఉంది.

తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన..

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

మొదటిపేజీ తరువాయి

వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

జగన్ ఒక ‘అరుదైన పీస్’.. కేసులు తేలేవరకు రాజకీయాలకు దూరం ఉండాలి: సోమిరెడ్డి

మొదటిపేజీ తరువాయి

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లోనే జగన్ ఒక అరుదైన పీస్ అని వ్యాఖ్యానించారు. ఆయనపై నమోదైన కేసులు తేలేంత వరకు రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.దేశంలో ఏ ఇతర రాజకీయ నాయకుడిపై లేనన్ని సీబీఐ, ఈడీ కేసులు జగన్‌పై ఉన్నాయని సోమిరెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల ప్రసాదం కోసం కల్తీ నెయ్యి వాడారని... అది పెద్ద పాపమని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఈడీ దర్యాప్తులో వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఈ కేసుల్లో సీబీఐ కోర్టు రోజువారీ విచారణ ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు.తండ్రి అధికారాన్ని దుర్వినియోగం చేసి రూ. 43,000 కోట్లు అక్రమంగా సంపాదించారనే ఆరోపణలు, కల్తీ నెయ్యి కేసులో రూ. 130 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంట్, వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో రూ. 40 కోట్ల కోణంపై ఈడీ దర్యాప్తు వంటి అంశాలను సోమిరెడ్డి గుర్తుచేశారు. అంతేకాకుండా, రూ. 3,500 కోట్ల నకిలీ మద్యం కుంభకోణం వల్ల 30,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆరోపించారు.బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ, తనపై ఆరోపణలు వచ్చినప్పుడు కేసు తేలే వరకు పార్లమెంటు పదవికి రాజీనామా చేశారని సోమిరెడ్డి ఉదహరించారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే, అదే విధంగా విచారణ ముగిసేంత వరకు రాజకీయాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కేసుల్లో వందలాది మంది సాక్షులు ఉన్నందున జగన్ రోజూ కోర్టుకు హాజరు కావాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

కధం తొక్కిన యువమోర్చా

సంగారెడ్డి, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ అమరవీరుల గౌరవం తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం. దాంతో పాటు ఆ కుటుంబానికి నెలకు రూ. 25 వేలు పెన్షన్, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం. ప్రతి ఏటా జూన్ 2న (తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం) అధికారిక జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయడం. అర్హులైన నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి అందించాలి. పైన తెలిపిన 5 హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది, అబద్ధపు హామీలతో యువతను మోసం చేసింది, ఈ దుర్మార్గమైన చర్యను నిరసిస్తూ శనివారం భారతీయ జనతా యువమోర్చా శాఖ ఆధ్వర్యంలో భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షులు బొర్రా ప్రవీణ్ యాదవ్, రాష్ట్ర భారతీయ జనతా యువమోర్చా ట్రెజరర్ నరేన్ దేశపాండె ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ ఐబీ నుండి, కొత్త బస్టాండ్ వరకూ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా జనరల్ సెక్రటరీ లు రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రావు, పట్టణ అధ్యక్షులు వాసు, విజయ్, ధార్మిక సేల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, ఓబీసీ మోర్చా జి ఎస్ మల్లేశం, బీజేపీ జిల్లా సెక్రటరీ మందులు నాగరాజు గౌడ్, రవి శంకర్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు



చంటి ప్రభు, మహిళా మోర్చా అధ్యక్షురాలు మీనా గౌడ్, జిల్లా పార్టీ నాయకులు యువ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

టీజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని టీజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో అన్ని శాఖల ఉద్యోగులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని చేకూర్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత, డిఎంహెచ్ వో లలితా దేవి, కలెక్టరేట్ లోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సదాశివపేట లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లోనూ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిని పూజించే అరుదైన పూల పండుగ బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేకమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఈ పండుగ చిహ్నంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుకా చిరు, కౌన్సిలర్ లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అంగరంగవైభవంగా నవరాత్రి ఉత్సవాలు

సంగారెడ్డి, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాభవాని అమ్మవారిని సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పట్టణంలోని కల్వకుంట రోడ్డు, శాంతినగర్ వద్ద కసిని చంద్రకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గాభవాని అమ్మవారి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని శ్రీ జయదుర్గాదేవి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు



ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కౌన్సిలర్ దశరథ్ రెడ్డి, జీవీ శ్రీనివాస్, విఠల్, మోహన్, చక్రపాణి, కసిని చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం

తాండూర్, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబరాలకు పట్టణంలోని సాయిపూర్ సిద్ధమవుతోంది. 9వ వార్డులోని తాత గుడి ఆవరణలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు బతకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పట్లో దీపా నర్సింలు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, ఆర్తి రెడ్డి, ప్రమోదిని, విట్టల్ రెడ్డి హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో వేడుకలను విజయవంతం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. తాండూరు పట్టణంలోని అన్ని వార్డుల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సద్దుల బతుకమ్మ సంబరాలలో పాల్గొనాలని, దీపా నర్సింహులు కోరారు. బతుకమ్మ ఆటపాటలతో పండుగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటాలని పిలుపునిచ్చారు. మహిళల భాగస్వామ్యంతో వేడుకను విజయవంతం చేయాలని అను విజ్ఞప్తి చేశారు.



భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలకు అందించాలి

పూలతో పేర్చిన బతుకమ్మలు... ఆటపాటలతో ఉద్యోగస్థుల సంబరాలు

బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుపడంలో పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరు సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పట్టణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ పూలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని, ప్రకృతిని ఆరాధిస్తూ సంప్రదాయాలను కాపాడుకునే గొప్ప పండుగగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పండుగలను సామూహికంగా జరుపుకోవడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందుతాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో ప్రాంగణ మంతా పండుగ శోభ సంతరించుకుంది. సంప్రదాయబద్ధంగా పండుగను సామూహికంగా జరుపుకోవడంతో కలెక్టరేట్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులతో పాటు కలెక్టరేట్ సమీప కాలనీలకు చెందిన మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





ఆల్ స్టేట్స్ పోలీస్ బైక్ ర్యాలీకి ఐఐటీలో ఘన స్వాగతం

ఏక్ థా దివాస్ కార్యక్రమం

ఐఐటీ హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన

మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టాలి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

ఏక్ థా దివాస్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని ఐసీసీసీ నుంచి గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వరకు నిర్వహిస్తున్న ఆల్ స్టేట్స్ పోలీస్ బైక్ ర్యాలీకి ఐఐటీ హైదరాబాద్‌లో ఘన స్వాగతం పలికారని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత తమ జీవితాల్లో అనేక దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసలైన వారి ఆరోగ్యం, భవిష్యత్తు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజానికి కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, తమ స్నేహితులు, తోటి విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఈగల్ టీమ్ డీఎస్పీ పుష్పన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్, ఎంఎన్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం






ద్వారా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐఐటీ హైదరాబాద్ డీన్ డా. ప్రశాంత్ కుమార్, డీన్ డా. ప్రేమ్ పాల్,, డీఎస్పీలు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ కు సన్మానం

తాండూర్, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

మండల పరిధిలోని చెన్గేస్ పూర్ గ్రామంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ నూతన చైర్మన్ గా ఆర్. శ్రీనివాస్ రెడ్డి నియామితులయ్యారు. అనంతరం ఆయనను సన్మానించి నియామక పత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తమపై నమ్మకంతో బాధ్యతను సద్వినియోగపరుస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పెద్ద పీఠ వేయాలి

గవర్నర్ కొటాలో నీలం మధుకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ఎన్ఎంఆర్ డివిజన్ ఇంచార్జీ బొయిని రవి ముదిరాజ్

జహీరాబాద్, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :



అన్నా అంటే నేనున్నానంటూ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పలు సేవ కార్యక్రమాలు, పేదలకు నేనున్నానని ధైర్యం చెబుతున్న మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నీలం మధు ముదిరాజ్ కు గవర్నర్ కొటాలో ఖాలీగా ఉన్న ఎమ్మెల్సీ పదవీ ఇవ్వాలని ఎన్ఎంఆర్ యువసేన నియోజకవర్గ ఇంచార్జీ బొయిని రవి ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటాలో ఖాలీగా ఉన్న ఎమ్మెల్సీ పదవి బిసి బిడ్డ సామాజిక వర్గానికి చేందిన నీలం మధు ముదిరాజ్ కు బిసి కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని, పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, పేదలకు రేషన్ కార్డులు, 200ల యూనిట్లు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వ్యవసాయానికి సబ్సిడీ డ్రీప్, ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకేల్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నీలం మధు ముదిరాజ్ కు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వాలని కోరారు.

ప్రధాన మార్గాలలో ట్రాఫిక్ సమస్యలు

తాండూర్, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

తాండూరు పట్టణంలోని శాంత్ మహల్ చౌరస్తా నుండి భద్రపగుడికి వెళ్లే మార్గంలో,అదేవిధంగా ఇందిరా చౌక్ నుండి కాళికాదేవి మందిరానికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దుకాణదారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహించడంతో రహదారి ఇరుగ్గా మారి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా తోపుడు బండ్లు చిరు వ్యాపారస్తులు రోడ్డుపైనే తమ వ్యాపారాలు కొనసాగించడం ద్వారా ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి, ఒకరిని చూసి మరొకరు పోటాపోటీగా రోడ్డుపైకి దుకాణాలు విస్తరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలను అధికారులు గుర్తించి రోడ్ల ఆక్రమణను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు,వాహనదారులు కోరుతున్నారు.





జాడిమల్కాపూర్ లో పించన్ల పరిశీలన

జడ్పీ సీఈఓ జానకి రాంరెడ్డి

జహీరాబాద్, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

మండల కేంద్రమైన మొగుడం పల్లి గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీ జానకి రాంరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పింఛన్ లబ్ధిదారుల వివరాలను ర్యాండమ్ పద్ధతిలో పరిశీలించి, పింఛన్ల వెరిఫికేషన్ నిర్వహించారు. గ్రామంలో నీటి సంరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతంలో అనిశ్చితి, నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను తప్పనిసరిగా నిర్మించుకోవాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మణియార్పల్లి గ్రామంలో ఒక లబ్ధిదారుడి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణానికి మార్కింగ్ చేసి, పనులను ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి కుటుంబం నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ బి రాజు ఉపసర్పంచ్ ఎజాస్ పటేల్ ఎం పి ఓ క్రిష్ణకుమార్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నవరాత్రి ఉత్సవాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్

భక్తి మనకు ఆధ్యాత్మిక బలాన్ని ఇస్తుంది.. సేవ సమాజంలో ఐక్యతను పెంచుతుంది

అమీన్ పూర్, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

నియోజకవర్గంలోని అమీన్పూర్ మండలం పరిధిలోని అమీన్పూర్, బీరంగూడ డివిజన్లలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమీన్ పూర్, బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. వివిధ ప్రాంతాల్లో పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. “సనాతన ధర్మ పరిరక్షణ మనందరి బాధ్యత” ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలు మాత్రమే కాకుండా, హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావం, సామాజిక ఐక్యతను చాటిచెప్పే పవిత్రమైన పండుగలని అన్నారు. మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలి.. మన సంప్రదాయాలను భావితరాలకు అందించాలని, ధర్మాన్ని ఆచరిస్తూ, సేవాభావంతో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని



ఆయన పిలుపునిచ్చారు. దుర్గామాత ఆరాధన స్త్రీశక్తికి, ధర్మానికి, ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాలు యువతలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని చాటిచెబుతాయని, భక్తితో పాటు సేవా దృక్పథం కూడా ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. పండుగలు కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ కలిపే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు.

భవానీ మాతను దర్శించుకున్న శంకర్ యాదవ్

తాండూర్, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బసవన్న కట్ట వద్ద ప్రతిష్టించిన భవాని మాతను ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి శంకర్ యాదవ్ శనివారం రోజు తమ మిత్రులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు, అనంతరం ఉత్సవ నిర్వాహకులకు ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ యాదవ్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు భక్తి ఆధ్యాత్మికకు ప్రతీకలని అమ్మవారి ఆరాధనలతో ప్రజల్లో భక్తి భావం ఐక్యత పెంపొందుతాయని అన్నారు,భవాని మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు, పండుగలను అందరూ కలిసిమెలిసి భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల నర్సింలు, ప్రభాకర్ గౌడ్, బంటుమల్లప్ప, సంతోష్ గౌడ్, మహేష్ ఠాకూర్, రుద్రపటేల్, చంటి యాదవ్, రజినీకాంత్, జొన్నల వినోద్ కుమార్,వెంకటేష్ చారితో పాటు పలువురు మిత్రులు ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.



జీర్లపల్లిలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు

ఆటపాటలతో సందడిగా పండుగ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట

జహీరాబాద్, అక్టోబర్ 17, వార్త దీపిక న్యూస్ :

ఝరాసంగం మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామంలో బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అమరేశ్వరి శివమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామంలోని ఆడపడుచులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని గ్రామస్థులు పేర్కొన్నారు.



గోకవరం దేవి చౌక్ అమ్మవారి వెండి గోపురానికి 100 గ్రాముల వెండి విరాళం

విజయ దుర్గ బ్రాయిలర్స్ అధినేత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి, ఆయన సతీమణి సిరి దంపతుల దాతృత్వం

గోకవరం అక్టోబర్ 17, (వార్త దీపిక న్యూస్)

గోకవరం దేవి చౌక్‌లో కొలువుదీరిన అమ్మవారి ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. అమ్మవారి వెండి గోపురం నిర్మాణం నిమిత్తం విజయ దుర్గ బ్రాయిలర్స్ అధినేత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి, ఆయన సతీమణి సిరి దంపతులు 100 గ్రాముల వెండిని విరాళంగా అందజేశారు. అమ్మవారిపై తమకున్న భక్తి, విశ్వాసంతో ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే సదుద్దేశంతో శివ రమేష్ రెడ్డి దంపతులు ఈ విరాళాన్ని అందించడం విశేషం. దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు భక్తులు తమవంతు సహకారం అందించడం సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను మరింత పెంపొందిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు



గోకవరం దేవి చౌక్ అమ్మవారి వెండి గోపురం నిర్మాణానికి అవసరమైన సహకారాన్ని అందించడం ద్వారా శివ రమేష్ రెడ్డి దంపతులు తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా భక్తులు, దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా విరాళాలు అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా దాత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి, ఆయన సతీమణి సిరి దంపతులకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. అమ్మవారి ఆశీస్సులు దాతల కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్య క్రమంలో విజయ దుర్గ బ్రాయిలర్స్ అధినేత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి దంపతుల వెంట గోకవరంలోని ప్రసన్నలక్ష్మి చికెన్ సెంటర్ అధినేత కర్రి సూరా రెడ్డి కూడా పాల్గొన్నారు.

గోకవరం వద్ద 10 కిలోల గంజాయి స్వాధీనం -- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

గోకవరం, అక్టోబర్ 17,(వార్త దీపిక న్యూస్)

గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని తంటి కొండ ఆర్చ్ సమీపంలో, రంపచోడవరం నుంచి రాజమండ్రి వెళ్లే (516ఇ)జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల సమయంలో గంజాయిని కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బత్తుల శ్రీనివాసరావు(వయస్సు 46 సంవత్సరాలు,) తండ్రి పేరు వెంకటేశ్వర్లు, కులం వడ్డె, వృత్తి సన్యాసి (సాధువు). పెదకాకాని గ్రామం మరియు మండలం, గుంటూరు జిల్లా. కర్రీ సాయి రెడ్డి, తండ్రి వెంకటరెడ్డి, వయస్సు 60 సంవత్సరాలు, కులం రెడ్డి వృత్తి సన్యాసి (సాధువు), ద్రాక్షరామం గ్రామం మరియు మండలం. ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో పోలీసుల తనిఖీల సందర్భంగా రెండు బ్యాగులతో వెళ్తున్న వ్యక్తుల ప్రవర్తనపై అనుమానం రావడంతో వారిని ఆపి విచారించారు. అనంతరం చట్టపరమైన ప్రక్రియను అనుసరించి గోకవరం డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో తనిఖీలు నిర్వహించగా, వారి వద్ద ఉన్న రెండు పార్సిళ్లలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు.స్వాధీనం చేసుకున్న గంజాయి బరువు మొత్తం 10 కిలోలు కాగా, ఒక్కో పార్సిల్‌లో 5 కిలోల చొప్పున ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు ఒక మొబైల్ ఫోన్, రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బత్తుల శ్రీనివాసరావు అలియాస్ స్వామి (46), కర్రీ సాయి రెడ్డి (60)లను అరెస్ట్ చేసి గంజాయిని అక్రమంగా కలిగి ఉండటం, రవాణా చేయడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు.

